క్లుప్తంగా

ఆలయానికి రూ. 2.52లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లీ సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు రూ. 2.52 లక్షలను అందించినట్లు ఈఓ రామక్రిష్ణ బుధవారం తెలిపారు. ఆలయ మహాప్రాకార నిర్మాణం కోసం నగదును అందించారన్నారు. విశాఖపట్నానికి చెందిన కృష్ణ చైతన్య, లక్ష్మీసుమిత్ర దంపతులు అన్నదానానికి రూ.2 లక్షలు, మహాప్రాకారానికి రూ. 42 వేలు విరాళంగా అందించినట్లు వెల్లడించారు. అలాగే కర్నూల్‌కు చెందిన ప్రమీలాదేవి రూ. 10,116 అందజేసినట్లు తెలిపారు. సుబ్బారెడ్డి, అర్చకుడు నారాయణస్వామి ఉన్నారు.

ఆర్జీఎం అధ్యాపకులకు డాక్టరేట్



కౌషర్‌బాషా



గోపికృష్ణ

పాణ్యం: ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులు కౌషర్‌బాషా, ఏకే గోపికృష్ణలకు డాక్టరేట్ లభించినట్లు ప్రిన్సిపల్ జయచంద్రప్రసాద్ తెలిపారు. 'ఏ ప్రొటెన్షియల్ ప్లాట్‌ఫామ్ ఫర్ ఈఎల్‌జీ అండ్ ఈఎల్‌ఎల్ అమాంగ్ ది ఇంజినీరింగ్ స్టూడెంట్ ఫర్ రాయలసీమ రీజియన్', 'ఎక్స్‌ప్లోరింగ్ సాఫ్ట్ స్కిల్ టు ఎన్‌హ్యాన్స్ ఎంప్లాయిబిలిటీ అమాంగ్ స్టూడెంట్' అనే అంశాలపై వీరిద్దరికి ఎస్‌టీయూ అనంతపురం డాక్టరేట్ ప్రదానం చేయనుందన్నారు. చెర్మన్ శాంతిరాముడు, డీన్ ఆశోక్‌కుమార్ అభినందించారు.

కబడ్డీ విజేత కొంతలపాడు



నగదు బహుమతి అందుకుంటున్న కొంతలపాడు జట్టు

ఓర్వకల్లు: మండలంలోని పూడిచెర్ల గ్రామంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ఎస్ కొంతలపాడు జట్టు విజేతగా నిలిచింది. క్రిస్మస్ పండుగ సందర్భంగా స్థానిక ఏబీఎం చర్చి సంఘస్తుల ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో పోటీలు జరిగాయి. మొత్తం 15 జట్లు పాల్గొన్నాయి. ఎస్.కొంతలపాడు మొదటి స్థానంలో నిలిచి రూ.20 వేలు అందుకుంది. అలాగే కర్నూలు స్టేడియం జట్టు రెండో స్థానం సాధించి రూ.15 వేలు, మూడో స్థానంలో నిలిచిన ప్యాపిలి జట్టుకు రూ.10 వేలు, నాల్గో స్థానం సాధించిన పూడిచెర్ల జట్టుకు రూ.5 వేల చొప్పున బహుమతులు అందజేశారు.

కేసీకి 159 క్యూసెక్కుల నీటి విడుదల



గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు బుధవారం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.990 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

డ్రోన్ వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

సి.బెళగల్: రైతులు డ్రోన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మారందొడ్డి, బురాన్‌దొడ్డి గ్రామాల్లో వ్యవసాయంలో డ్రోన్ వినియోగం, ప్రభుత్వ సహకారాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాంకేతిక వ్యవసాయంలో భాగంగా రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై మండలానికి మూడు డ్రోన్లను మంజూరు చేస్తుందని, సాగులో డ్రోన్ల వినియోగానికి అన్నదాతలు ముందుకు రావాలన్నారు. పలు సలహాలు, సూచనలు చేశారు.

నల్లమలలో వ్యక్తి మృతి

మహానంది: నల్లమల అడవిలోని పాలేరువాగు వెంట ఉన్న ఉసిరిక వనం సమీపంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్యలో ఉన్న ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేవలం షర్టు ధరించి ఉన్నాడని, మతి స్థిమితం లేక నల్లమలలోని వచ్చి ఉంటారని, ఆకలితో అలమటిస్తూ మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు.

సత్తా చాటేందుకు చక్కటి అవకాశం

- గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే క్రీడా పోటీలు
- పెంచికలపాడులో కబడ్డీ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే సుధాకర్



క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్

గూడూరు రూరల్: గ్రామీణ క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఆడుదాం ఆంధ్రా పోటీలు చక్కటి వేదికని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ అన్నారు. బుధవారం పెంచికలపాడు హైస్కూల్‌లో కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహిస్తోందని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ పోటీలను వివిధ దశల్లో 47 రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1500 సచివాలయాల పరిధిలో పోటీలను నిర్వహిస్తూ విజేత జట్లకు రూ. 12 కోట్ల విలువైన బహుమతులను అందించనున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడాకారులు తమ ప్రతిభ, నైపుణ్యాలను ప్రదర్శించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాముడు, సర్పంచ్ లతమ్మ, నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, రాముడు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

గుర్తిండిపోయేలా పోటీలు

కర్నూలు సిటీ: చరిత్రలో గుర్తుండిపోయేలా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను రాష్ట్ర ప్రభుత్వ నిర్వహిస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ అన్నారు. కర్నూలు రూరల్ మండల పరిధిలోని దిన్నెదేవరపాడు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు దశల్లో పోటీల నిర్వహణ ఉంటుందని, రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల సచివాలయాల్లో క్రీడలు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం క్రీడాకారులతో కలిసి కాసేపు కబడ్డీ ఆడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజాంఖాన్, జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, నాయకులు హరినాథ్ రెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జయన్న సూచించారు. బుధవారం మండలంలోని వర్కూరు, పులకుర్తి గ్రామాల్లో ఈఓఆర్డీ మంజులతో కలిసి వాలీబాల్, కబడ్డీ పోటీలను ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహిస్తోందని తెలిపారు.

క్రీడలతో ఆరోగ్యం

క్రీడల ద్వారా ఆరోగ్యం కలుగుతుందని కోడుమూరు ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని అమడగుంట్ల, గోరంట్ల గ్రామాల్లో క్రీడా పోటీలకు ప్రారంభించారు. క్రీడల్లో సత్తా చాటి సొంతూరుకి మంచి పేరు తీసుకురావాలన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే సుధాకర్

ఉత్సాహంగా పోటీలు

సి.బెళగల్: మండలంలోని గ్రామాల్లో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు రెండో రోజు బుధవారం ఉత్సాహంగా సాగాయి. సి.బెళగల్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల పీడీ రాఘవేంద్ర, స్థానిక జెడ్పీ హైస్కూల్ పీడీ సుంకరావు ఎనిమిది జట్లకు క్రికెట్ పోటలను నిర్వహించారు. సి.బెళగల్ సచివాలయంలో–1లో వినోద్ జట్టు, 2లో చరణ్ జట్టు, 3లో వీరేష్ జట్టు విజయం సాధించినట్లు అధికారులు తెలిపారు. పోలకల్ జెడ్పీ హైస్కూల్లో కబడ్డీ, క్రికెట్ పోటీలు జరిగాయి.

● క్రీడలతో ఆత్మవిశ్వాసం

కల్లూరు: క్రీడాలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం సల్కాపురం సచివాలయం పరిధిలోని నెరవాడ, కే.మార్కాపురంలో ఆడుదాం ఆంధ్రా క్రీడాలను ఆయన పరిశీలించారు. కే.మార్కాపురంలో వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం పెద్దకొట్టాల ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలని సూచించారు.



వాలీబాల్ ఆడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు



వర్కూరులో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ జయన్న

నేడు బెళగల్‌లో వికసిత్ భారత్

సి.బెళగల్: మండలంలోని రెండు గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. మండల పరిధిలోని సి.బెళగల్ గ్రామంలో ఉదయం 10 గంటలకు, గొల్లలదొడ్డి గ్రామ పంచాయతీలో మధ్యాహ్నం 3 గంటలకు ఈ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆయా శాఖల మండల, గ్రామస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

పెళ్లి కాలేదని యువకుడి ఆత్మహత్య

కర్నూలు: వయసు దాటిపోతున్నా పెళ్లి కాలేదన్న మనస్తాపంతో కర్నూలు సీతారామనగర్‌కు చెందిన భాస్కర్ (40) మంగళవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడివున్న అతన్ని కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు.

మెడికల్ షాపులో చోరీ

కర్నూలు రోజా వీధిలోని వెంకటరమణ మెడికల్ స్టోర్‌లో చోరీ జరిగింది. మంగళవారం రాత్రి మెడికల్ షాపు యజమాని వరప్రసాద్ ఎప్పటిలాగే దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం దుకాణం తెరిచి చూడగా టేబుల్ డ్రాలో ఉంచిన రూ.లక్ష నగదు అదృశ్యమైంది. దొంగలు షాపు వెనుకవైపు ఉన్న తలుపులు తెరిచి లోనికి ప్రవేశించి చోరీ చేసినట్లు గుర్తించాడు. దీనిపై రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వెంకటరమణ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యపానంతో జీవితాలు నాశనం



సూచనలు చేస్తున్న ఎస్‌ఐ

కోడుమూరు: మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్‌ఐ శ్రీనివాసులు అన్నారు. బుధవారం కోడుమూరులో హమాలీలతో సమావేశమై మద్యం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. కార్మికులు మద్యానికి బానిసలు కావడం వల్ల కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయన్నారు. మద్యం మహమ్మారికి సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా మద్యానికి పెట్టే డబ్బులను కుటుంబానికి ఖర్చు పెట్టుకోవాలని సూచించారు. పిల్లలను చక్కగా చదివించుకోవాలన్నారు. మద్యం మత్తులో వాహనాలను నడపడం వల్ల ప్రమాదాల బారిన పడి విలువైన ప్రాణాలను కోల్పోవాల్సి ఉంటుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీపీఐ నాయకులు క్రిష్ణ, రాజు, రాముడు పాల్గొన్నారు.

ఏఎంసీలో వైద్యుల మధ్య వివాదం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఏఎంసీలో విధుల విషయంలో వైద్యుల మధ్య వివాదం నెలకొంది. బుధవారం ఉదయం 9.30 గంటల సమయంలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఏఎంసీ విభాగానికి వెళ్లి రోగులతో మాట్లాడారు. వైద్యులు ఎంత సమయానికి వస్తున్నారు, బాగా చూస్తున్నారా అంటూ ఆరా తీశారు. ఇదే సమయంలో అక్కడికి వచ్చిన డ్యూటీ డాక్టర్‌ను సైతం ఆయన ప్రశ్నించారు. ఇప్పుడు సమయం ఎంత అయ్యిందని అడిగారు. ఆలస్యంగా వస్తే ఎలాగని ప్రశ్నించారు. ఓ ప్రొఫెసర్‌ను సైతం ఆయన ఇలాగే వివరాలు అడగడంతో జనరల్ మెడిసిన్ వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేడర్‌లో తమ కంటే చిన్నవాడైన డాక్టర్ కిరణ్‌కుమార్ తమను ఎలా ప్రశ్నిస్తారని మండిపడ్డారు. తాము రెగ్యులర్‌గా రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తున్నామని, అయినా ఇలా ప్రశ్నించడం తగదన్నారు. ఈ విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఏఎంసీ పర్యవేక్షణకు తాము అధికారిని నియమించామని, ఆ విభాగంలో వసతులు, సౌకర్యాలతో పాటు వైద్యుల వివరాలు కూడా కనుక్కోవాలని సూచించామన్నారు. ఈ విషయమై తాను హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్‌తో మాట్లాడతానని, ఏఎంసీలో వైద్యులు విధులు రౌండ్ ది క్లాక్ నిర్వహించాలని ఆదేశించారు. రోగులకు ఇబ్బంది రాకుండా చికిత్స చేయాలని సూచించారు.

కుష్టు వ్యాధిని ముందే గుర్తిస్తే నివారణ



ప్రచార పత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): ప్రాథమిక దశలోనే కుష్టు వ్యాధిని గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసి అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ అన్నారు. బుధవారం స్థానిక ఎ.క్యాంపులోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో 'లెప్రసి కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్'ను ఆయన ప్రారంభించారు. జిల్లాలో వచ్చే నెల 12వ తేదీ వరకు ఇంటింటికి ఆశ వర్కర్, వలంటీర్ వెళ్లి ప్రతి కుటుంబ సభ్యుడిని పరీక్ష చేస్తారన్నారు. స్పర్శలేని మచ్చలు, నరాల వాపు, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం, కాళ్ల నుంచి చెప్పులు జారిపోవడం, కాళ్లకు పుండ్లు మొదలైన లక్షణాలు ఉంటే సమీప మెడికల్ ఆఫీసర్‌తో పరీక్ష చేయిస్తారన్నారు. వ్యాధినిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ఆరు నెలల పాటు ఈ మందులు వాడితే కుష్టు వ్యాధిని నయం చేయవచ్చన్నారు. సమాజంలో కుష్టు రోగులపై వివక్ష, చిన్నచూపు చూడరాదన్నారు. కార్యక్రమంలో టీబీ అధికారి(డీఎస్‌ఎంఓ) మల్లికార్జున్‌రెడ్డి, హెచ్‌ఈఓ శివశంకర్‌రావు, యుపీహెచ్‌సీ వైద్యాధికారి మాధవి, మెడికల్ ఆఫీసర్ శ్రీదేవి, డీపీఎంఓ రాజు, హక్, పీటీ రెడ్డి, బాబు పాల్గొన్నారు.

డీటీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ రంగారెడ్డి

కర్నూలు (టౌన్): డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ 2024 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి రంగారెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. 10వ తరగతి ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో డీటీఎఫ్ నాయకులు క్రిష్ణ, తిమ్మన్న, తాజుద్దీన్, సోమశేఖర్, వెంకటరాముడు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌ఏ అదనపు కో-ఆర్డినేటర్‌గా విజయజ్యోతి

కర్నూలు (టౌన్): సమగ్ర శిక్ష అదనపు కోఆర్డినేటర్‌గా సీహెచ్ విజయజ్యోతి కుమారిని నియమించారు. ఇక్కడ అదనపు కోఆర్డినేటర్‌గా కె.వేణుగోపాల్ పనిచేస్తున్నారు. వీరిద్దరూ రెవెన్యూ విభాగంలో డిప్యూటీ తహసీల్దార్ల హోదాలో పనిచేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం వీరికి డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వేణుగోపాల్‌కు ప్రభుత్వం స్థానం కేటాయించాల్సి ఉంది.

వేధింపుల కేసు నమోదు

కృష్ణగిరి: కల్లూరు మండలం కేంద్రం, పార్వతినగర్‌కు చెందిన ఉప్పరి శ్రీలతను కృష్ణగిరి మండలం మాదాపురానికి చెందిన భర్త, అతని కుటుంబ సభ్యులు వేధిస్తున్నట్లు బుధవారం కృష్ణగిరి పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఎస్‌ఐ సురేశ్ తెలిపిన వివరాల మేరకు బాధితురాలికి, ఉప్పరి మధుతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఇటీవల పిల్లలు పుట్టలేదని, అదనపు కట్నం తీసుకురమ్మని భర్త, ఆ కుటుంబ సభ్యులు వేధిస్తున్నట్లు పిర్యాదు చేసింది. శ్రీలత ఫిర్యాదు మేరకు ఆమె భర్తతో పాటు మరో ఐదుగురు కుటుంబ సభ్యులపై వేధింపుల కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అక్రమ మద్యం ధ్వంసం



మద్యాన్ని ధ్వంసం చేయిస్తున్న సెబ్ సీఐ హరిక్రిష్ణ, సిబ్బంది

ఆదోనిరూరల్: వివిధ కేసుల్లో ఆదోని సెబ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన అక్రమ మద్యాన్ని బుధవారం రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ హరిక్రిష్ణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా అడిషనల్ ఎస్పీ క్రిష్ణకాంత్‌పటేల్ ఆదేశాల మేరకు జిల్లా ఏఈఎస్ రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మద్యాన్ని ధ్వంసం చేసినట్లు చెప్పారు. మొత్తం 20 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 158 లీటర్ల సారా, 91 కేసుల్లో పట్టుబడిన 24,404 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు నేలపాలు చేసినట్లు చెప్పారు. ఎప్పటికప్పుడు అక్రమ మద్యం సరఫరాపై ఉక్కుపాదం మోపుతున్నామని పేర్కొన్నారు.

నేటి నుంచి నంది బాలోత్సవాలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని మునిసిపల్ టౌన్ హాల్‌లో నంది విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నంది బాలోత్సవాలు కార్యక్రమాన్ని ఈ నెల 28, 29 తేదీలలో నిర్వహిస్తున్నట్లు నంది విజ్ఞాన కేంద్రం సభ్యులు శంకరయ్య, రామరాజు, మాదాల శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మునిసిపల్ టౌన్ హాల్‌లో నంది బాలోత్సవాల కార్యక్రమాల పోస్టర్ విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లోని విద్యార్థులందరూ పాల్గొనాలన్నారు.

ముస్లింలకు ప్రాధాన్యత కల్పించండి

- ఫోమా అధ్యక్షుడు ఎంఏ హమీద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏ హమీద్

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలోని ముస్లిం మైనారిటీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలని ఫెడరేషన్ ఆఫ్ ముస్లిమ్స్ అసోసియేషన్ (ఫోమా) నేతలు కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోమా అధ్యక్షుడు ఎంఏ హమీద్ మాట్లాడారు. ముస్లిం జనాభాలో 15 శాతం మంది ధనికులను మినహాయిస్తే మిగిలిన 85 శాతం మంది ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇందులో 5 శాతం మంది ముస్లింలు తమ భార్య, పిల్లలు, తల్లిదండ్రులను వదలి గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి బతుకుతున్నారని చెప్పారు. వేల ఎకరాల వక్ఫ్ భూముల్లో 70 శాతం ఆక్రమణలకు గురైందని తెలిపారు. ముస్లింల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు. ముస్లింల పరిస్థితిని అర్థం చేసుకుని అన్ని రాజకీయ పార్టీలు చట్టసభల్లో తమకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఫోమా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ అజీజ్‌ఖాన్, ఉపాధ్యక్షుడు ఎంఎండీ పాషా, కోశాధికారి షేక్ అహమ్మద్ అన్వర్‌బాషా పాల్గొన్నారు.

30న కలెక్టరేట్ ఎదుట ఆర్పీల నిరసన



మాట్లాడుతున్న అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): మెప్మాలో పనిచేసే ఆర్పీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30వ తేదీ కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు తెలిపారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఆర్పీల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్పీలపై రాజకీయ ఒత్తిళ్లను తగ్గించాలని కోరారు. జగనన్న మాల్స్‌లో ఒక్కో అర్పీ రూ.1.5 లక్షల విలువ చేసే సరుకులను కొనుగోలు చేయించేలా చూడాలని కోరడం సరికాదన్నారు. ఆర్పీల జిల్లా కార్యదర్శి ఉమాదేవి, నాయకులు షబానా, సుజాత, పర్వీన్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే కాటసాని జన్మదినం



బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ రామయ్య

కల్లూరు: వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే స్వగృహం వద్ద కల్లూరు రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దంపతులు ప్రారంభించారు.

బ్యాగుల పంపిణీ

దాతల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ నంద్యాల చెక్‌పోస్టు వద్ద జేఎస్ బిల్డర్స్, వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎం.జిలాన్ బాషా ఆధ్వర్యంలో 500 మందికి వారు బ్యాగులు పంపిణీ చేశారు. అలాగే 37వ వార్డు వీకర్‌సెక్షన్ కాలనీలో ఎస్‌ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మహమ్మద్ ఇలియాస్ ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో కార్పొరేటర్లు నాగలక్ష్మిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, డీఏఏడీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, నాయకులు భీమా శంకర్‌రెడ్డి, మహబూబ్ బాషా పాల్గొన్నారు.



కంటి ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు పంపిణీ

కంటి ఆస్పత్రిలో బ్రెడ్లు పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): కాటసాని రాంభూపాల్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ స్టేట్ లీగల్ సెల్ జనరల్ సెక్రటరీ కర్నాటి పుల్లారెడ్డి ఆధ్వర్యంలో ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆస్పత్రిలో సూపరింటెండెంట్ పృథ్వీ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. కర్నూలు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎం.సుబ్బయ్య, న్యాయవాదులు ప్రభాకర్, సురేష్ మహరాజ్, సుబ్రహ్మణ్యం, రమణారెడ్డి, సురేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు



కోర్టు కేసులో ఉన్న స్థలంలో నిర్మించిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు



ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

సి.బెళగల్: ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) నాగరాజు నాయుడు హెచ్చరించారు. బుధవారం సి.బెళగల్ మండలం గొల్లలదొడ్డి గ్రామంలో డివిజన్ లెవల్ పంచాయతీ అధికారిణి (డీఎల్‌పీఓ) తిమ్మక్కతో కలిసి ప్రభుత్వ స్థలాల ఆక్రమణల ఫిర్యాదులపై విచారణ చేశారు. ఆక్రమణ స్థలాలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. కోర్టు కేసులో ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన ఇల్లు, గుడి నిర్మాణాలను పరిశీలించారు. అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. అనంతరం స్థానిక గ్రామ సచివాలయ ఆవరణలో గ్రామస్తులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించుకోవాలని, ప్రభుత్వ అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని సూచించారు. వారి వెంట తహసీల్దార్ శేషఫణి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు



బి.అగ్రహారంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

గోనెగండ్ల: గ్రామాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడి గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సీతారామయ్య హెచ్చరించారు. బుధవారం సాయంత్రం మండలంలోని బి.అగ్రహారం గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. అల్లరి మూకలు ప్రవర్తన మార్చుకొని ప్రశాంత జీవనం గడపాలన్నారు. మద్యం సేవించి గొడవలు సృష్టించే విధంగా నడుచుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సీఐ మోహన్ రెడ్డి, ఎస్‌ఐ తిమ్మారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కోడుమూరు, పాణ్యం
70750 09147 (కోడుమూరు),
70750 09185 (పాణ్యం)
Office mail : sakshiknladvt@gmail.com